సాక్షి
నిర్మల్
సోమవారం । 31 । మార్చి । 2025



గ్రూప్-1లో మనోళ్ల సత్తా

గ్రూప్-1 జనరల్ ర్యాంకింగ్స్‌లో ఉమ్మడి జిల్లా వాసులు సత్తా చాటారు. పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 8లో▸

‘తైక్వాండో’ ఇన్‌చార్జిగా భూషణ్



నిర్మల్‌టౌన్: తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ జిల్లా ఇన్‌చార్జిగా అమ్ముల భూషణ్‌ను నియమిస్తూ రాష్ట్ర సెక్రెటరీ ప్రవీణ్ ఆదివారం నియామకపత్రం అందజేశారు. తైక్వాండో క్రీడలపై యువతకు ఆసక్తి పెంచాలని సూచించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.4 /25.5

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటుంది. రాత్రి కూడా వేడిసెగలు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

కామోల్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు



పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యే

భైంసారూరల్: మండలంలోని కామోల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఆదివారం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే రామారావుపటేల్ హాజరై శోభాయాత్రలో పాల్గొన్నారు. అనంతరం రాములోరికి పట్టువస్త్రాలు సమర్పించారు. గ్రామంలో పెద్ద మొత్తంలో భక్తులు శ్రీరామ మాలధారణ వేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరికీ ఎమ్మెల్యే ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ దేవి ఆలయంలో ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్లకు అభిషేకం, అలంకరణ, అర్చన, హారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

మన్ కీ బాత్ వీక్షించిన ‘ఏలేటి’



కార్యక్రమాన్ని వీక్షిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ 120వ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి వీక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, ఆకుల కార్తీక్, సుంకరి సాయి, రాచకొండ సాగర్, ఒకే దేశం ఒకే ఎన్నిక కన్వీనర్ అచ్యుత్ రావ్, జమాల్, రూరల్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు రంజిత్, విజయ్, నర్సయ్య, రవి, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన రితీశ్ రాథోడ్



బాధ్యతలు స్వీకరిస్తున్న రితీశ్ రాథోడ్

నిర్మల్‌చైన్‌గేట్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని రితీశ్ రాథోడ్ ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో కార్యాలయ రిజిస్టర్‌లో తొలి సంతకం చేశారు. అనంతరం బీజేపీ నేతలు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాచకొండ సాగర్, అంకం మహేందర్, నల్లా రవీందర్‌రెడ్డి, ఒడిసెల అర్జున్, ఆకుల కార్తీక్, సాయి కుమార్, మల్లేశ్, తోకల భూచన్న, పుప్పాల ఉపేందర్, కాశవేణి శ్రీనివాస్, వెంకటేష్, బొడ్డు కిరణ్, పిట్టల భూమన్న, కంతి లింబాద్రి, తిరుమల గిరి, ఇనుముల స్వామి, జీవన్ పాల్గొన్నారు.

బాసర ఆలయంలో ప్రత్యేక పూజలు

బాసర: గ్రూప్-1 ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికైన కరెండే మహేందర్ ఆదివారం బాసర జ్ఞాన సరస్వతి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు సంజీవ్ పూజారి అమ్మవారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 900 మార్కులకు గానూ 471 వచ్చాయని, సరస్వతి అమ్మవారి ఆశీస్సులతో డీఎస్పీగా ఎంపికయ్యానని మహేందర్ సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విశ్వావసు సంబురం



సాంస్కృతిక ప్రదర్శనలో చిన్నారులు

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని సన్మానిస్తున్న వెన్నెల డ్యాన్స్ అకాడమీ సభ్యులు



ఓలాలో వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్న రైతు కుటుంబ సభ్యులు



- వైభవంగా ఉగాది వేడుకలు
- వ్యవసాయ క్షేత్రాల్లో రైతుల పూజలు
- ఆలయాల్లో పంచాంగ శ్రవణం

నిర్మల్‌ఖిల్లా/భైంసాటౌన్: తెలుగు సంవత్సరాది విశ్వావసు నామ ఉగాది వేడుకలను జిల్లా వాసులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఉదయాన్నే చేలకు వెళ్లి వ్యవసాయ క్షేత్రాల్లో పూజలు చేశారు. అలాగే ఇళ్లలోనూ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఉగాది పచ్చడి, బూరెలు చేసుకుని ఇంటిల్లిపాది ఆరగించారు. నిర్మల్ చౌరస్తాలో హిందూవాహిని ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పి రామారావు పటేల్ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. సాయంత్రం పలు ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో నిర్మల భారతి సాహితీ క్షేత్రం, తెలంగాణ రచయితల వేదిక, డాక్టర్ అప్పాల కావేరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. 50 మందికి పైగా కవులు కవితాగానం చేశారు. జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో శ్రీ లక్ష్మీనరసింహమూర్తి పంచాంగ శ్రవణం అనంతరం శారదామాత పీఠ వ్యవస్థాపకులు తడపాకల్ శ్రీ సచ్చిదానంద స్వామి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. చిన్నారుల శాస్త్రీయ నృత్యాలు ప్రేక్షకులను రంజింప చేశాయి. పాటేమాప్రాణం బృందం సంగీత విభావరి ఆకట్టుకుంది. జబర్దస్త్ కళాకారుల హాస్యవల్లరి ప్రేక్షకుల నవ్వులవర్షం కురిపించింది.



సాంస్కృతిక ప్రదర్శనలతో అలరిస్తున్న చిన్నారులు



ఉగాది ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం చేస్తూ..



హోమం చేస్తున్న ఉగాది ఉత్సవ సమితి సభ్యులు

ఆధ్యాత్మిక మార్గం కావాలె..

ఏ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న ఆ ప్రాంతానికి సరైన రవాణా సౌకర్యాలు ఉండాలి. జిల్లాలో ఇప్పటికీ సరిహద్దు ప్రాంతాలు అభివృద్ధికి దూరంలోనే ఉన్నాయి. హైదరాబాద్-నర్సాపూర్-బోధన్ మీదుగా బాసర-భైంసా వరకు 161బీబీ హైవే నిర్మిస్తున్నారు. ఇదే హైవేను ఇప్పుడు మహారాష్ట్రలోనే శక్తి పీఠమైన మహోర్ వరకు పొడగించాలని జిల్లావాసులు కోరుతున్నారు. బాసర నుంచి భైంసా మీదుగా మహోర్ వరకు పొడగిస్తే.. ఇటు సరస్వతీ క్షేత్రం నుంచి అటు శక్తిపీఠం వరకు ఆధ్యాత్మిక కారిడార్ అవుతుందంటున్నారు. ఈ విషయంపై ఇటీవల అసెంబ్లీలోనూ ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. – భైంసా



భైంసా-బాసర రహదారి

- బాసర హైవే మహోర్ దాకా పొడగించాలి..
- ఆధ్యాత్మిక కారిడార్‌తో పాటు..
- పర్యాటకపరంగా అవకాశాలు
- ‘మరాఠీ’ సంబంధాలు బలోపేతం
- సరిహద్దు ప్రాంతాల్లో హైవే అవసరం
- రెండింటి మధ్య సాసర్‌కుండ్ జలపాతం

సరిహద్దులో అవసరం..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహారాష్ట్రకు ఆనుకుని ఉంది. నిర్మల్ జిల్లాలో ముధోల్ నియోజకవర్గం పూర్తిగా సరిహద్దుకు కలిసి ఉంది. ఈ ప్రాంతంలో మరాఠీ ఎక్కువగా మాట్లాడుతారు. ఇక్కడ ఉండే వారికి మహారాష్ట్రతో బంధుత్వం ఉంది. ఎన్నో ఏళ్లుగా శుభకార్యాలకు ఇతర కార్యక్రమాలకు జిల్లా ప్రజలు సరిహద్దు మహారాష్ట్రకు వెళ్తుంటారు. పక్కనే సరిహద్దు ఉన్నా అక్కడికి వెళ్లేందుకు వీలుగా రహదారులు అంతంతగానే ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతవాసులు ఆధ్యాత్మిక కారిడార్‌ను కలుపుతూ హైవే నిర్మించాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలోని బాసర, నాందేడ్ జిల్లాలోని మహోర్‌ను కలుపుతూ హైవే నిర్మించాలని కోరుతున్నారు.

అభివృద్ధికీ మార్గం...

బాసర నుంచి భైంసా మీదుగా మహోర్ వరకు హైవే పొడగిస్తే.. సరిహద్దు ప్రాంతంలో అభివృద్ధికీ మార్గం వేసినట్లవుతుంది. ఈ మార్గాల మధ్య పలు పట్టణాలు ఉన్నాయి. భైంసా, కుభీర్, హిమాయత్‌నగర్, కిన్వట్, సాసర్‌కుండ్, ఇస్లాపూర్ పట్టణాలను కలుపుతూ ఈ మార్గం వెళ్లనుంది. హైవే పూర్తయితే వాణిజ్య సంబంధాలూ మెరుగవుతాయి. రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చే భక్తులు బాసర వరకే వచ్చి ఇక్కడ పిల్లలకు అక్షరాభ్యాస పూజలు జరిపించి తిరిగివెళ్తున్నారు. సరైన రోడ్డులేక మహోర్‌కు వెళ్లలేకపోతున్నారు. నాందేడ్ జిల్లా పరిధిలో చారిత్రక పుణ్యక్షేత్రాలు ఎన్నో ఉన్నాయి. కానీ సరైన మార్గం లేకే బాసర నుంచే వెనుదిరుగుతున్నారు. కేంద్రం ఇప్పటికైనా దృష్టి సారించి రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక కారిడార్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అసెంబ్లీలో ప్రస్తావించా



బాసర నుంచి భైంసా మీదుగా చేపడుతున్న హైవేను మహారాష్ట్రలోని మహోర్ వరకూ పొడగించాల్సిన అవసరం ఉంది. ఇదే విషయాన్ని గతంలో కేంద్రం దృష్టికి తీసుకెళ్లా. తాజాగా అసెంబ్లీలోనూ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చా. స్థానిక ప్రాంతాల అభివృద్ధికి ఇలాంటి రోడ్డుమార్గాలు అవసరం.

– రామారావుపటేల్, ఎమ్మెల్యే, ముధోల్



రెండు క్షేత్రాల వారధిగా...

చదువుల తల్లిగా పూజలందుకుంటున్న సరస్వతీదేవి బాసరలో కొలువుదీరింది. పక్కనే మహారాష్ట్రలోని మహోర్‌లో రేణుకా ఎల్లమ్మగా అమ్మవారు కొలువయ్యారు. అలాగే ఇక్కడ ప్రసిద్ధ దత్తాత్రేయ మందిరం కూడా ఉంది. మహారాష్ట్రతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మహానుబావు ఆచారం పాటించే మరాఠీయులు దత్తాత్రేయ స్వామినే కొలుస్తారు. ఏటా బాసర, మహోర్ పుణ్యక్షేత్రాలకు లక్షల మంది భక్తులు వెళ్తుంటారు. బాసరలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్న యాత్రికులు 164 కిలోమీటర్ల దూరంలో ఉన్న మహోర్ ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నారు. హైవేను పొడగిస్తే రవాణా ఇబ్బందులు తీరుతాయి. ఇక రెండు క్షేత్రాల మధ్య మహారాష్ట్రలోని సాసర్‌కుండ్‌లో ప్రసిద్ధ జలపాతం ఉంది. ఈ క్షేత్రాలకు వెళ్లే యాత్రికులంతా జలపాతం వద్ద ఆగి అక్కడి అందాలు వీక్షిస్తుంటారు. మహారాష్ట్ర యాత్రికులు ముందుగా మహోర్‌లో దర్శనాలు చేసుకుని బాసరకు వస్తుంటారు. దసరా నవరాత్రుల్లో బాసర, మహోర్‌లలో ప్రత్యేక ఉత్సవాలు, దర్శనాలు ఉంటాయి. ఈక్రమంలోనే రెండు పుణ్యక్షేత్రాల మధ్య ఆధ్యాత్మిక కారిడార్ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



రంజాన్ ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ



ఈద్గా వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: రంజాన్‌ను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని ఈద్గాం చౌరస్తా వద్ద ఈద్గాను ఆదివారం ఎస్పీ జానకీ షర్మిల పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను పరిశీలించి సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ప్రార్థన సమయంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూసుకోవాలన్నారు. వాహనాల కోసం తగినంత పార్కింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఈద్గా, మసీదులు, ముఖ్యమైన ప్రదేశాల్లో పికెట్స్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో దాదాపు 350 మంది సిబ్బందితో బందోబస్తు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా పటిష్ట బందోబస్తు ఉంటుందన్నారు. నిర్మల్ పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ ప్రేంకుమార్, సిబ్బంది ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో గల ఈద్గాను ఎస్పీ సందర్శించారు. భద్రతా ఏర్పాట్లపై అడిగి తెలుసుకున్నారు. ముస్లింల ప్రార్థనల నేపథ్యంలో ట్రాఫిక్, వాహనాల పార్కింగ్‌కు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సీఐ గోపీనాథ్‌కు సూచించారు. ఆమె వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎండీ జాబీర్ అహ్మద్, ఎంఐఎం నాయకులు ఉన్నారు.

సైనిక్‌స్కూల్ ప్రవేశ పరీక్షలో ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో కరస్పాండెంట్

కడెం: సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో లింగాపూర్ శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కరస్పాండెంట్ నిశిత విజయ్ కుమార్ తెలిపారు. నస్పూరి వెంకటేశ్వర్ 1వ, రాజశేఖర్ 9వ, రాథోడ్ లోకేష్ 11వ, కుంసోత్ దీపక్ 12వ, రితీష్ నాయక్ 22వ, మాలవత్ కిషోర్ 94వ, గుండా అనిరుధ్ 135వ, చోలే ఆయుష్ 208వ, బొమ్మ మహాశ్రీ 222వ, క్రిష్ణరాజ్ 266వ, సాత్విక్ 469వ ర్యాంక్‌లు సాధించారు. విద్యార్థులను పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.



పసుల అద్వీత్

దిలావర్‌పూర్: మండల కేంద్రానికి చెందిన పసుల లావణ్య, పవన్ దంపతుల కుమారుడు పసుల అద్వీత్ సైనిక్ ప్రవేశ పరీక్షలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకు సాధించాడు. శనివారం రాత్రి వెలువడిన ఫలితాల్లో సదరు విద్యార్థి సత్తా చాటాడు. స్థానిక విజేత పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న విద్యార్థి నవోదయ, సైనిక్ పరీక్షలకు శిక్షణ తీసుకున్నాడు.

సెర్ప్‌లోకి.. మెప్మా

- ఒకే గొడుగు కిందికి మహిళా సంఘాలు
- ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వం
- మున్సిపాలిటీల్లోని ఉద్యోగులు డీఆర్డీఏ పరిధిలోకి..

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణ ప్రాంతాల్లో పొదుపు సంఘాల మహిళలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న మెప్మా.. ఇక నుంచి డీఆర్డీఏ పరిధిలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో విలీనం కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల్లోని మెప్మా ఉద్యోగులు, సిబ్బందితో పాటు జిల్లా కేంద్రంలోని మెప్మా జిల్లా కార్యాలయ ఉద్యోగులంతా సెర్ప్ పరిధిలోకి వెళ్లనున్నారు.

కమిషనర్ల ఆధ్వర్యంలో విధులు

మున్సిపాలిటీల్లో మహిళలను గ్రూపుగా ఏర్పాటు చేసే మెప్మా ఉద్యోగులు జిల్లాలో 11 మంది, వార్డుల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే మెప్మా రిసోర్స్ పర్సన్లు 95 మంది వరకు ఉన్నారు. వీరంతా మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో పనిచేస్తున్నారు. మహిళా సంఘాలకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించడంతో పాటు నెలనెలా చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో ఈ పనిని సెర్ప్ కార్యాలయం కింద పనిచేసే ఉద్యోగులు పర్యవేక్షిస్తున్నారు. ఈ రెండు శాఖలను విలీనం చేస్తే సెర్ప్ కార్యాలయంలో విధులు నిర్వర్తించనున్నారు.

పట్టణాల్లో సర్వేలకు ఇబ్బందే..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు, ఇతరత్రా పనులను క్షేత్రస్థాయిలో మెప్మా ఆర్పీలు, మెప్మా సీవోలు సర్వే చేస్తుంటారు. మెప్మా ఆర్పీలకు కాలనీల్లో ఉండే వివరాలు తేలికగా తెలిసే అవకాశం ఉంటుందని.. ప్రతీ సర్వేకు వారి సేవలను వినియోగించుకున్నారు. ఇక నుంచి వారు ఇతర శాఖ పరిధిలోకి వెళ్తే.. మున్సిపాలిటీ సేవలకు వారు వచ్చే అవకాశం ఉండకపోవచ్చు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ప్రభుత్వం చేపట్టే సర్వే చేయాలంటే ఇక నుంచి మున్సిపల్ యంత్రాంగానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.



ముబ్లిలో స్వయం సహాయక సంఘాల సభ్యులు

జీత భత్యాల్లో తేడా...

పట్టణాల్లోని మెప్మా రిసోర్సు పర్సన్లకు నెలకు రూ.6వేల వేతనం చెల్లిస్తుంటే, సెర్ప్ ఆర్పీలకు రూ.5వేల చొప్పున చెల్లిస్తున్నారు. ఒకవేళ ఈ రెండు గ్రూపులు కలిపితే జీతాలు పెరుగుతాయా? తగ్గుతాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళా సంఘాల విలీనంపై త్వరలో మార్గదర్శకాలు విడుదల కానున్నాయని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. విలీన అంశంపై అధికార వర్గాల్లో కూడా చర్చ జరుగుతోంది.

కార్యకలాపాలు ఎప్పటిలాగేనా?

పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటిలాగే కార్యకలాపాలు ఉండే అవకాశమున్నట్లు సమాచారం. ఒకేశాఖ పరిధిలో ఉద్యోగులంతా పనిచేసేలా విధివిధానాలు తయారు చేస్తున్నట్లు తెలుస్తోంది. సర్వేలు, ఓటర్ల జాబితాలు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలన, ఇతర సంక్షేమ పథకాలతో పాటు మహిళా సంఘాల పనితీరు యథావిధిగా ఉండనున్నట్లుగా తెలుస్తోంది. గతంలో మాదిరిగా గ్రామీణ, పట్టణ సంస్థలు కాకుండా ఒకేచోట ఒకే అధికారి పర్యవేక్షణలో ఉద్యోగులంతా పనిచేయనున్నట్లు మెప్మా ఉద్యోగులు అంటున్నారు. మొత్తానికి విలీన అంశాన్ని ఉద్యోగులు స్వాగతిస్తున్నట్లుగా చెబుతున్నారు.

జిల్లా వివరాలు	
మొత్తం మండలాలు	: 18
స్వయం సహాయక సంఘాలు	: 12,215
సభ్యులు	: 1,34,002
గ్రామైక్య సంఘాలు	: 505
మొత్తం మున్సిపాలిటీలు	: 03
మెప్మా ఉద్యోగులు	: 11
రిసోర్స్ పర్సన్లు	: 95

శుభ పరిణామం..

రాష్ట్ర ప్రభుత్వం మెప్మా ఉద్యోగులను సెర్ప్‌లో విలీనం చేయడం శుభపరిణామం. అలాగే మెప్మా ఉద్యోగులకు కూడా సెర్ప్ ఉద్యోగుల మాదిరి అన్నిరకాల బెనిఫిట్స్ అందించాలి. అధికారుల ఉత్తర్వుల ప్రకారం నడుచుకుంటాం.

– సుభాష్, మెప్మా ఇన్‌చార్జి పీడీ

క్లుప్తంగా

రైతుపై చిరుత దాడి



గాయపడిన రైతుతో ఫారెస్ట్ అధికారులు

తాంసి: రైతుపై చిరుత దాడి చేసిన ఘటన భీంపూర్ మండలం వడ్గాం పంచాయతీ పరిధి రాజ్‌ఘడ్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన రైతు గోడం తుకారం మరో వ్యక్తితో కలిసి ఆదివారం మధ్యాహ్నం అటవీ ప్రాంతం రాజ్‌ఘడ్ శివారులో పంట చేనుకు వెళ్లాడు. ఈక్రమంలో చిరుత ఒక్కసారిగా రైతుపై దాడి చేసింది. ఈదాడిలో ఆయన మెడ, తలకు గాయాలయ్యాయి. రైతు, మరో వ్యక్తి ప్రతిఘటించి, గట్టిగా కేకలు వేయడంతో చిరుత అక్కడి నుంచి వెళ్లింది. గాయపడిన రైతును అంబులెన్స్‌లో గ్రామస్తులు రిమ్స్‌కు తరలించారు. ఫారెస్ట్ సెక్షన్ అధికారి అహ్మద్‌ఖాన్, బీట్ అధికారి సాయికుమార్ బాధిత రైతును పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని సూచించారు. కాగా, ఘటన స్థలాన్ని పరిశీలించి రైతుపై దాడి చేసింది చిరుతానా, లేక వేరే అడవి జంతువు అనేది నిర్ధారించాల్సి ఉందని అహ్మద్‌ఖాన్ తెలిపారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం

బజార్‌హత్నూర్: మండలంలోని మాడగూడ గ్రామంలో శనివారం రాత్రి ఆదివాసీ గిరిజన రైతు మడవి దినకర్ ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. దినకర్ తన కుటుంబ సభ్యులు కట్టెల పొయ్యిపై వంట చేసుకుని భోజనం చేసి నిద్రపోయారు. ప్రమాదవశాత్తు పొయ్యిలోని నిప్పు ఇంటికి అంటుకుని మంటలు వ్యాపించాయి. కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలార్పివేశారు. ఘటన స్థలాన్ని ఆర్ఐ నూర్‌సింగ్ ఆదివారం పరిశీలించారు. రూ.52 వేల విలువ గల ఆస్తినష్టం వాటిల్లినట్లు నిర్ధారించారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు. ఆర్ఐ వెంట మాజీ సర్పంచ్ మడవి ప్రకాశ్, గ్రామపటేల్ గెడం లక్ష్మణ్, సీతారాం, జంగు తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం



రామేశ్వర్ (ఫైల్)

ఇంద్రవెల్లి: మండలంలోని గౌరపూర్ పంచాయతీ పరిధి మోహన్‌సింగ్‌తండాకు చెందిన యువకుడు సాబ్లే రామేశ్వర్ (24)అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు, ఎస్సై సునీల్ తెలిపిన వివరాలు.. సాబ్లే రామేశ్వర్ ఈనెల 28న బ్యాంక్ పని నిమిత్తం కుటుంబీకుల చెప్పి ఆదిలాబాద్ వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లలో, చుట్టూపక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ దొరకలేదు. ఆదివారం సాయంత్రం తండ్రి సాబ్లే భోజ్‌రాజ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అలరించిన కుస్తీపోటీలు



పురుషుడితో కుస్తీపడుతున్న దేవకి

కుభీర్: ఉగాది పురస్కరించుకొని మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర కుస్తీపోటీలు అలరించాయి. తెలంగాణ నుంచి, మహారాష్ట్రలోని పలు గ్రామాలు నుంచి మల్లయోధులు పాల్గొన్నారు. చివరి కుస్తీ పోటీలో మహారాష్ట్రలోని హింగోలికి చెందిన బాలాజీ రూ.6 వేల నగదును గెలుచుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ముగ్గురు బాలికలు సాయిశ్రీ, దేవకి, పల్లవిలు మగ పిల్లలతో కుస్తీపట్టి వారిని ఓడించి బహుమతులు గెలుచుకున్నారు.

బాసర వేద పండితుడికి ఉగాది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న నవీన్‌శర్మ

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి ఆలయ ఆస్థాన సామవేద పండితుడు బ్రహ్మశ్రీ కందికోట నవీన్‌శర్మకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది పురస్కారం ప్రకటించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ ఆయనకు ఈ పురస్కారం అందించారు. తనకు పురస్కారం రావడం ఆనందంగా ఉందని నవీన్‌శర్మ పేర్కొన్నారు.

గ్రూప్–1లో మనోళ్ల సత్తా

- జనరల్ ర్యాంకింగ్స్ జాబితాలో పలువురు..
- ఈ ర్యాంకుల ఆధారంగా సర్టిఫికెట్ వెరిఫికేషన్
- ఎంపికైనవారికి వ్యక్తిగతంగా సమాచారం

తెలంగాణలో గ్రూప్–1 మెయిన్స్ పరీక్ష ఫలితాల్లో ప్రొవిజనల్ మార్కులు, జనరల్ ర్యాంకింగ్స్ జాబితాను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇటీవల విడుదల చేసింది. ఏడు పేపర్ల మార్కులు, జనరల్ ర్యాంకింగ్స్‌తో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో ప్రకటించారు. మార్కుల మెమోలు మార్చి 30 నుంచి ఏప్రిల్ 5 సాయంత్రం 5 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు టీజీపీఎస్సీ ఐడీ, హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, ఓటీపీతో లాగిన్ చేసి మెమోలను పొందాలి. ఈ ర్యాంకుల ఆధారంగా అభ్యర్థులను సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలుస్తామని టీజీపీఎస్సీ తెలిపింది. ఎంపికైనవారికి వ్యక్తిగతంగా సమాచారం అందజేస్తారని, అందుకోసం ఒరిజినల్ సర్టిఫికెట్లు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు యువకులు ర్యాంకులు సాధించారు. ఇందులో ఇప్పటికే కొందరు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే ఉత్తమ ర్యాంక్‌లు సాధించడం గమనార్హం.

డీఎస్పీగా ఎంపికైన మహేందర్



మహేందర్‌కు స్వీట్లు తినిపిస్తున్న కుటుంబ సభ్యులు

బాసర: మండలంలోని కిర్గుల్ (బి) గ్రామానికి చెందిన కరండే మహేందర్ గ్రూప్–1లో 471 మార్కులతో జనరల్ ర్యాంక్ 219 సాధించి డీఎస్పీగా ఎంపికయ్యాడు. ఉజ్వల–సంజీవ్ దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు మహేందర్ చిన్నప్పటి నుంచి చదువులో రాణిస్తూ, తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా ఉండేవాడు. 2017లో ఎస్టీటీ ఉపాధ్యాయుడిగా, 2020లో సివిల్ ఎస్సైగా ఎంపికై సాధించాడు. నేరడిగొండలో ఎస్సైగా, నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణం పరిధిలోని రుద్రూర్‌లో ఎస్సైగా విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం గుడిహత్నూర్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆయన గ్రూప్–1లో డీఎస్పీగా ఎంపికవడంపై స్వగ్రామంలో ప్రజలు అభినందనలు తెలిపారు. గురువులు నేర్పిన పాఠాలే నాకు ఆదర్శమని, అమ్మానాన్నల కష్టం వృథా కాకుండా పోలీసు ఉద్యోగం వచ్చినందుకు సంతోషంగా ఉందని మహేందర్ తెలిపాడు.

అదనపు కలెక్టర్ భార్యకు 68వ ర్యాంక్



బరీరా ఫరీద్

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ స్థానిక సంస్థల అదనపుకలెక్టర్ ఫైజాన్ అహ్మద్ భార్య బరీరా ఫరీద్ రాష్ట్రస్థాయిలో 68వ ర్యాంక్ (బీసీ ఈ కేటగిరీలో ప్రథమ ర్యాంకు) సాధించింది. ఈమె..ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టర్ ఆఫ్ ఫార్మసీ డిగ్రీని పూర్తిచేసింది. సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమవుతూ 2022లో సివిల్స్‌లో ఇంటర్వ్యూ వరకు వెళ్లింది. హైదరాబాద్‌కు చెందిన షేక్ ఫరీరుద్దీన్, షమీన్ ఉన్నిసా దంపతుల ఏడుగురు సంతానంలో చివరి వ్యక్తి ఈమె. తండ్రి భారత వాయుసేనలో రిటైర్డ్ ఉద్యోగి. గ్రూప్–1లో 68వ ర్యాంక్ సాధించిన బరీర ఫరీద్‌కు అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కుటుంబసభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కొలువు చేస్తూనే..మరో కొలువు..



విష్ణునందన్

దండేపల్లి: మండల కేంద్రానికి చెందిన పాత రమేశ్–కేసరి దంపతుల పెద్దకుమారుడు పాత విష్ణునందన్ గ్రూప్–1లో 476.5 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 166వ ర్యాంకు సాధించాడు. విష్ణునందన్ ఇటీవల గ్రూప్–4లో ఉద్యోగం సాధించి హార్టికల్చర్ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్–1లో మంచి ర్యాంకు సాధించినందుకుగాను కుటుంబీకులు, బంధువుల సంతోషం వ్యక్తం చేశారు.

బండల్‌నాగాపూర్ వాసి ప్రతిభ



సచిన్‌రెడ్డి

తాంసి: మండలంలోని బండల్‌నాగాపూర్‌కు చెందిన సురుకుంటి సచిన్‌రెడ్డి గ్రూప్–1లో 454.5 మార్కులతో రాష్ట్రస్థాయిలో 503 ర్యాంక్ సాధించాడు. ఇప్పటికే గ్రూప్–4 ఫలితాల్లో ప్రతిభ కనబర్చి ఆదిలాబాద్ మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ముంబయిలో ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. సివిల్స్ సాధించడమే లక్ష్యమని సచిన్‌రెడ్డి పేర్కొన్నాడు. ఈయన తల్లిదండ్రులు మంజుల–శ్రీధర్ రెడ్డి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. గ్రూప్–1లో రాష్ట్రస్థాయిలో ర్యాంక్ సాధించిన సచిన్‌రెడ్డిని పలువురు అభినందించారు.

సత్తాచాటిన ఆవుడం యువకుడు



అమ్మానాన్నలతో సుమంత్‌గౌడ్

నెన్నెల: మండలంలోని ఆవుడం గ్రామానికి చెందిన మండల సుమంత్‌గౌడ్ సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో 286వ ర్యాంకు, మల్టీజోన్‌లో 126వ ర్యాంకు సాధించారు. గతంలో గ్రూప్–2, 3, 4లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. ప్రస్తుతం జీహెచ్‌ఎంసీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గ్రూప్–2లో రాష్ట్ర స్థాయిలో 172వ ర్యాంకు, గ్రూప్–3లో 102వ ర్యాంకు, గ్రూప్–4లో 88వ ర్యాంకు దక్కించుకున్నారు. గ్రూప్–1 సాధించడమే లక్ష్యంగా కోచింగ్ లేకుండా రోజుకు 10 గంటలు కష్టపడి చదివానని తన కష్టానికి తగిన ర్యాంకు వచ్చిందని సుమంత్ సంతోషం వ్యక్తం చేశాడు.

భైంసావాసికి 157వ ర్యాంకు



సాయికుమార్

భైంసాటౌన్: పట్టణంలోని అయోధ్యనగర్‌కు చెందిన సుర్వే సాయికుమార్ గ్రూప్–1లో 157వ ర్యాంకు సాధించాడు. లోకేశ్వరం మండలం పొట్‌పెల్లి(బి)కి చెందిన రత్నమాల–సిద్దేశ్వర్ దంపతులు కొన్నేళ్లుగా భైంసాలో నివాసముంటున్నారు. వీరి కుమారుడు సాయికుమార్ తిరుచ్చిలోని ఎన్ఐటీలో బీటెక్ పూర్తి చేశాడు. కొద్దిరోజులు గుర్గావ్‌లోని మారుతి సుజుకీ కంపెనీలో పనిచేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యాడు. ఈక్రమంలో గ్రూప్–2లో 1907, గ్రూప్–3లో 744 ర్యాంకు సాధించాడు. ప్రస్తుతం గ్రూప్–1లోనూ సత్తాచాటాడు. యూపీఎస్సీ(సివిల్ సర్వీసెస్) సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు.

పండుగపూట విషాదం

- దైవ దర్శనానికి వెళ్లి..కానరాని లోకాలకు
- శంకర్‌లొద్ది గుండంలో పడి యువకుడి మృతి



పవార్ శంకర్ (ఫైల్)



పవార్ శంకర్ మృతదేహం

నార్నూర్: ఉగాది పండుగపూట విషాదం నెలకొంది. దైవ దర్శనానికి వెళ్లి శంకర్ లొద్ది గుండంలో పడి యువకుడు మృతిచెందాడు. కుమురం భీం జిల్లా కెరమెరి మండలం శంకర్‌లొద్ది గుండం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. నార్నూర్ మండలంలోని గంగాపూర్ తండా చెందిన పవార్ సంగీత–ఉత్తం దంపతులకు ఇద్దరు సంతానం. ఒక కూతురు పెళ్లయింది. ఒక కుమారుడు పవార్ శంకర్ (22) ఉన్నాడు. శంకర్ బొలెరో వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దంపతులిద్దరు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ దీక్షలో ఉన్నారు. ఉగాది సందర్భంగా కెరమెరి మండలంలోని శంకర్‌లొద్దిలో శివలింగం గుహలో దర్శనంతోపాటు దీక్ష గురువు శ్రీ సద్గురు ప్రేంసింగ్ మహారాజ్ దీక్ష చేపట్టిన పుణ్యస్థలం కావడంతో సేవాలాల్ భక్తులు, మాలధరించిన వారు వందల సంఖ్యలో వెళ్లారు. దీక్షలో ఉన్న దంపతులిద్దరు ఆదివారం కుమారుడిని వెంట తీసుకెళ్లారు. గుహ ముందు ఉన్న వాగులో స్నానానికి బండపై నుంచి దూకాడు. నీటిలో రెండు రాయి మధ్య ఇరుక్కుని మునిగి చనిపోయాడు. గంగాపూర్ తండా గ్రామం శోకసంద్రంలో మునిగింది. కుమారుడు మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కెరమెరి ఎస్సై విజయ్ తెలిపారు.

తగ్గుతున్న ఎల్లంపల్లి నీటిమట్టం



ఎల్లంపల్లి జలాశయం

ఎల్లంపల్లి(శ్రీపాదసాగర్) ప్రాజెక్ట్ నీటిమట్టం రోజురోజుకు తగ్గుముఖం పడుతోంది. ఇటు వేసవి కాలం పైగా ఇతర ప్రాంతాల అవసరాలకు నీటిని తరలిస్తుండటంతో తగ్గుతోంది. ప్రాజెక్ట్ మట్టం 148 మీటర్ల క్రస్ట్ లెవెల్ కాగా 143 మీటర్లకు చేరగా 20.175 టీఎంసీలకు గాను 10 టీఎంసీల నీటి సామర్థ్యంతో ఉంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో లేకపోగా అవుట్ ఫ్లో కింద గూడెం ఎత్తిపోతల పథకానికి 290 క్యూసెక్కులు, హైదరాబాద్ మెట్రోవాటర్ వర్క్స్ సుజల స్రవంతి పథకానికి 324, ఎన్టీపీసీకి 242, నంది పంప్‌హౌజ్‌కు 3,150 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

– మంచిర్యాలరూరల్(హాజీపూర్)

అమ్మవారికి వెండివీణ బహూకరణ



దాతలు బహూకరించిన వీణ

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి దాతలు ఆదివారం వెండివీణ బహూకరించారు. నిజామాబాద్ జిల్లాలోని నవ్యభారతి గ్లోబల్ హైస్కూల్ సంస్థ చైర్మన్ క్యాతం శ్రీదేవి–సంతోష్ దంపతులు రూ.5 లక్షలతో 4 కేజీల వెండితో తయారు చేయించిన వెండి వీణను బహూకరించారు. అర్చకులు దాతలకు తీర్థప్రసాదం అందజేసి వారిని శాలువా కప్పి సత్కరించారు.

చిల్డ్రన్ గ్రౌండ్స్‌లో చీకట్లు



నందనవనంలో చీకటిగా ఉన్న చిల్డ్రన్ ప్లే గ్రౌండ్

శ్రీరాంపూర్: సింగరేణి చిల్డ్రన్ గ్రౌండ్స్‌లో చీకటి అలుముకుంది. చిన్నపాటి ఏర్పాట్లకు కూడా అధికారుల నిర్లక్ష్యం వల్ల పిల్లలకు ప్రమాదంగా మారింది. శ్రీరాంపూర్ ఏరియా పరిధిలోని నస్పూర్ కాలనీలోని రెండు చిల్డ్రన్ ప్లే గ్రౌండ్స్‌లలో లైటింగ్ సమస్య తీవ్రంగా ఉంది. నస్పూర్ కాలనీలోని మనోరంజన్ సముదాయం ఆవరణ, ఆర్కే5 కాలనీ వద్ద గల నందనవనం పార్కులోని చిల్డ్రన్ ప్లే గ్రౌండ్‌లు ఉన్నాయి. పిల్లల కోసం జారుడు బండ, ఉయ్యాలు, రంగుల రాట్నం తదితర ఆటలు ఆడుకోవడానికి ప్లేగ్రౌండ్‌లు ఏర్పాటు చేశారు. అయితే ఇందులో లైటింగ్ అధ్వానంగా ఉంది. ఉన్న కొన్ని పని చేస్తున్నాయి. మిగతావి చెడిపోయి వెలగడం లేదు. చీకటి పడితే చాలు పిల్లలు ఆడుకోవడానికి భయపడుతున్నారు. వేసవి కావడంతో సాయంత్రం వేళ పిల్లలతో మైదానాలు కిక్కిరిపోస్తున్నాయి. మరో పక్క పక్కనే చెట్ల పొదలు ఉండటంతో విషకీటకాలు, విషసర్పాలు వస్తున్నాయి. దీంతో ఎప్పుడేం ప్రమాదం జరుగుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

నేడే రంజాన్

- మసీదులు, ఈద్గాలు ముస్తాబు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



నెన్నెల/కెరమెరి: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు ఆదివారంతో ముగిశాయి. ముస్లింలు నెల రోజుల దీక్షలు పూర్తికావడం, సాయంత్రం ఆకాశంలో షవ్వాల్ నెలవంక దర్శనమిచ్చింది. సోమవారం పండుగను జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఉమ్మడిజిల్లాలోని ఈద్గాలు, మసీదులన్ని ఇప్పటికే ముస్తాబయ్యాయి. ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండుగ ప్రాముఖ్యతపై 'సాక్షి'కథనం.

ఈద్–ఉల్–ఫితర్ అంటే..

ఉపవాసదీక్షలు పాటించిన ముస్లింలు నెల అనంతరం షవ్వాల్ నెల మొదటిరోజు జరుపుకునే పండుగే ఈద్– ఉల్–ఫితర్. ఉదయాన్నే స్నానాలు చేసి, కొత్త బట్టలు ధరించి, అత్తర్ పూసుకొని, కళ్లకు కుర్మా పెట్టుకొని చిన్నా, పెద్దలంతా కలిసి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. పండుగ రోజు బంధువులు, స్నేహితులను ఇంటికి పిలిచి షీర్ ఖుర్మా (సేమియా)తో విందు ఏర్పాటు చేస్తారు. తామంతా ఒకేభావన, ప్రేమాభిమానాలు, సమైక్యత, సామరస్యాలు నెలకొల్పడంలో ఈ పండుగ ప్రముఖ పాత్ర పోషిస్తుంది.

జకాత్: ఇస్లాం నిర్దేశించిన సిద్ధాంతాల్లో జకాత్ నాల్గోది. జకాత్ అనగా దానం. ఇది మానవుల్లో త్యాగం, సానుభూతి, సహకారాలను పెంపొందిస్తుంది. ప్రతిఒక్కరూ తమకు ఉన్న దానిలో అవసరం ఉన్నవారికి ఇంత ఇచ్చి ఆదుకోవాలి. తమ వద్ద ఉన్న బంగారం, వెండి, రొక్కం, ఆ సంవత్సరం పండిన పంట, వ్యాపారం కోసం నిర్దేశించిన సరుకులు చివరికి తమ వద్ద ఉన్న పశువులను వెలకట్టి అందులో నుంచి 2.5 శాతం విధిగా దానం చేయాల్సి ఉంటుంది. నిరుపేదలు ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలనేది జకాత్ సిత్రాల ముఖ్య ఉద్దేశం.

ప్రత్యేక తరావీ నమాజ్‌లు: ప్రతీరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్‌లు చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీ నమాజ్‌లో 27 రోజుల పాటు హాఫీజ్‌లు పఠిస్తారు. రాత్రి ఇషా నమాజ్ అనంతరం తరావీ నమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తర్వాత 26వ రోజు సభ్యఖదర్ రాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరుపుతారు. 30 రోజుల ఉపవాస దీక్ష పాటించలేని వారు 26 రోజుల తర్వాత వచ్చే సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈద్ ఉల్ ఫీతర్ వరకు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. ఇహ లోకంలో ఆచరించే ఈ కఠోర దీక్షలు మనల్ని పరలోకంలో రక్షణగా ఉండి కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం.

ఫిత్రాదానం: షవ్వాల్ నెల మొదటి తేదీ ఈద్–ఉల్–ఫితర్ పండుగ. నాడు నమాజ్ ప్రార్థనకు ముందు పేదలకు ఇచ్చే దానమే ఫిత్రా. అందుకే ఈ పండుగను ఈద్–ఉల్–ఫిత్ర్ అని పేరు వచ్చింది. షరియత్ పరిభాషలో ఫిత్ర అంటే ఉపవాసాల పాటింపులో మనిషి ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న పొరపాట్లు జరుగుతుంటాయి. వీటిని పరిహారం చేసేదే ఫిత్రాదానం. పావుదక్కువ రెండుసేర్లు గోధుమలు తూకానికి సరిపడా పైకాన్ని నిరుపేదలకు ప్రతి ముస్లిం దానం చేయాలి.

స్థోమత ఉన్నవారంతా ఇవ్వాలి



ఆర్థికస్తోమత ఉన్నవారు జకాత్ చేయాలి. సొంతంగా సంపాదించిన దాని నుంచే దానం చేయాలి. రుణగ్రస్తులైతే ఇందులో అర్హులు కారు. వర్షాధారంగా పండే ఫలాలు, ధాన్యంపై పదో వంతు, బావులు, బోర్లు ఆధారంగా పండే వాటిపై ఐదో వంతు జకాత్ ఇవ్వాలి. – షేక్ హైదర్, ఇమాం, కెరమెరి

ఓలాలో భారీ అగ్నిప్రమాదం

- యంత్రాలు, కలప దగ్ధం



కాలిపోయిన విలువైన కలప

కుంటాల: మండలంలోని ఓలా గ్రామంలో శనివారం అర్ధరాత్రి భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యువకులు వేల్పూర్ రంజిత్, రాజశేఖర్, రాకేశ్ వడ్రంగి కులవృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇంటి పక్కనే గల మూడు షెడ్లు వేర్వేరుగా ఏర్పాటు చేసుకుని అనుమతి పొందిన టేకు కలపతో గృహ నిర్మాణ, పెళ్లిళ్ల పనులకు అవసరమయ్యే ఫర్నిచర్‌ను తయారు చేస్తుంటారు. శనివారం ప్రమాదవశాత్తు షెడ్లలో మంటలు చెలరేగాయి. పక్కనే నిద్రిస్తున్న మహారాష్ట్ర కూలీలకు మంటల వేడిని గమనించి కుటుంబ సభ్యులను అప్రమత్తం చేశారు. అప్పటికే మంటలు ఎగిసిపడి షెడ్లలో ఉన్న టేకు కలప, యంత్రాలు, సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి.

రూ.34 లక్షల ఆస్తినష్టం..

ఉగాది అమావాస్య పురస్కరించుకుని శనివారం వేల్పూర్ రంజిత్, రాజశేఖర్, రాకేశ్‌లు రైతులకు అవసరమయ్యే అరక పనులు చేసి నిద్రించారు. ఒకేసారి షెడ్లలో మంటలు వ్యాపించడంతో అందులో ఉన్న కలప, యంత్రాలు, వస్తువులు అగ్నికి బుగ్గిపాలయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పి వేశారు. రంజిత్‌కు షెడ్‌లో ఉన్న రూ.8 లక్షల కలప, రూ.3 లక్షల విలువ చేసే యంత్రాలు, సామగ్రి, రాజశేఖర్‌కు షెడ్‌లో రూ.10 లక్షల కలప, రూ.3 లక్షల యంత్రాలు, సామగ్రి, రాకేశ్ షెడ్‌లో ఉన్న రూ.5 లక్షల కలప, రూ. 5 లక్షల యంత్రాలు, పనిముట్లు కాలి బూడిదయ్యాయి. రూ.34 లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సి.అశోక్ పరిశీలించారు. ప్రభుత్వం తమను ఆదుకుని నష్టపరిహారం అందించాలని వేడుకున్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ఘటనల్లో ముగురు మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో ఒకరు, చికిత్స పొందుతూ వృద్ధుడు, మద్యానికి బానిసై మరొకరు మృతిచెందారు.

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలలోం సమీపంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. నిర్మల్–భైంసా రహదారిపై కాల్వ ఆలయ స్వాగత తోరణం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెందగా వాహనదారులు గమనించి ఎస్సై సందీప్‌కు సమాచారం అందించారు. అక్కడికి చేరుకుని ప్రమాదం తీరుపై ఆరా తీశారు. మృతుడు నర్సాపూర్(జి) మండలం బామ్ని గ్రామానికి చెందిన గోడ్సె కిషన్‌రావు (55)గా గుర్తించారు. నిర్మల్ పట్టణానికి వెళ్లి కాలినడకన రోడ్డు గుండా వస్తుండగా వాహనం ఢీకొనడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

మంచిర్యాలక్రైం: జీవితంపై విరక్తితో మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఏఎస్సై బి.సత్తయ్య కథనం ప్రకారం.. జిల్లాకేంద్రంలోని అశోక్‌రోడ్‌కు చెందిన సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి జింక దుర్గయ్య(71) గత కొంతకాలంగా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చూపించగా లివర్ పాడైపోయిందని వైద్యులు చెప్పారు. అయినా దుర్గయ్య మద్యం తాగేవాడు. జీవితంపై విరక్తితో ఈనెల 28న మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగి భార్య సమ్మక్కకు విషయం చెప్పాడు. వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్సపొందుతు ఆదివారం మృతిచెందాడు. మృతురాలి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

తాగుడుకు బానిసై వ్యక్తి..



వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన బోయర్ దేవిదాస్ (55) గత కొన్నేళ్లుగా తాగుడుకు బానిసయ్యాడు. ఇంటి నుంచి వెళ్లిపోయాడు. పట్టణంలోని రోడ్లపై తిరుగుతూ జీవనం సాగించేవాడు. ఆదివారం భుక్తాపూర్‌లోని బి–రాములు కాంప్లెక్స్ సమీపంలో గల ఓ తోపుడుబండిపై చనిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమందించగా మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించారు. ఈమేరకు వన్‌టౌన్ ఎస్సై అశోక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాసరలో పంచాంగ శ్రవణం



పంచాంగ శ్రవణంలో అర్చకుడు



పాల్గొన్న భక్తులు

బాసర: విశ్వావసు నామ సంవత్సరం సందర్భంగాబాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలోఆదివారం ఉగాది వేడుకలు, పంచాంగ శ్రవణం నిర్వహించారు. అర్చకుడు ప్రదీప్ దీక్షిత్.. 12 రాశుల ఫలితాలు ఆదాయ వ్యయాలు రాజ్యపూజ్య అవమానాలను తెలియజేశారు. అనంతరం స్థానికులు, భక్తులు అమ్మవారికి ప్రత్యేకపూజలు చేశారు. బాసర శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్తులకు అర్చకులు పంచాంగ శ్రవణం వివరించారు.